పొలంబడి.. సరికొత్త ఒరవడి

- సాగులో మెలకువలపై అవగాహన
- ఆధునిక పద్ధతులపై శిక్షణ

అలమూరు: దేశానికి అన్నం పెట్టేది రైతులే.. అలాంటి పుడమి పుత్రులు సాగులో సరికొత్త ఒరవడి సృష్టించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుంది. సాగులో మేలైన దిగుబడులు సాధించేలా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అధిక దిగుబడులే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేస్తోంది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సాగుకు సంబంధించిన అనేక సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఎరువులు, పురుగు మందుల నుంచి అన్నీ ఇక్కడే నుంచే అందిస్తోంది. పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులకు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తుంది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే వరి సాగు జరుగుతోంది. వ్యవసాయ శాఖ మొత్తం 129 పొలంబడుల నిర్వహణకు చర్యలు చేపట్టింది. ఈ పొలంబడిలో ఎంపికైన రైతులకు 14 వారాల పాటు శిక్షణ ఇచ్చారు. గ్రామ యూనిట్‌గా 30 మంది రైతులను ఎంపిక చేసి వారి నుంచి సుమారు 25 ఎకరాలు సేకరించి సాగును ప్రారంభించారు. ఇందులో రెండు ఎకరాల భూమిని తీసుకుని 50 సెంట్ల భూమిలో రైతు పద్ధతి, మరో 50 సెంట్లు శాస్త్రీయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. మరో ఎకరంలో ప్రయోగాత్మక సాగు జరుగుతోంది. దీంతో పాటు ఈ-క్రాప్, వైఎస్సార్ పంటల బీమా, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకునే విధానాన్ని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివరిస్తున్నారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రకాల సాగుతో కలిగే ప్రయోజనాలు, ఇబ్బందులను చెబుతున్నారు. అలాగే పొలంబడి ద్వారా వచ్చే మార్పులను భాగస్వామ్య కార్యాచరణ ద్వారా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు వివరిస్తున్నారు.



మనిషి పురుగు మందు ప్రభావానికి గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న అధికారులు



పొలంబడిలో భాగంగా రైతులకు భాగస్వామ్య కార్యాచరణను వివరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ప్రతి వారం పొలంబడి

క్షేత్రస్థాయిలో ప్రతి వారం నిర్వహించే పొలంబడిని విజయవంతం చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఉత్సాహవంతులైన, చురుకైన్న ఒక రైతును టీమ్ లీడర్‌గా ఎంపిక చేశారు. వ్యవసాయ శాఖ సహకారంతో మిగిలిన రైతులను సమన్వయం చేసుకుంటూ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యతను ఆ టీమ్ లీడర్ తీసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి వారం పొలంబడిలో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సాగులో మెళకువలు, ఆధునిక పద్ధతులను అధికారులు వివరిస్తున్నారు. అలాగే ప్రభుత్వం అందించే వివిధ రకాల మందులను పొలంబడికి ఎంపికైన రైతులకు అందించి ఆ మేరకు సాగులో వినియోగించేలా చేస్తున్నారు. అనంతరం ఎంపిక చేసిన పొలాల్లోని మట్టిని నమూనాలను సేకరించి పరీక్షలకు పంపుతున్నారు.

అన్ని దశల్లోనూ అవగాహన

వ్యవసాయశాఖ క్రమం తప్పకుండా వారం వారం పంట పొలాల్లో నిర్వహిస్తున్న పొలంబడి రైతులకు విజ్ఞానదాయకంగా నిలుస్తూ వరి సాగులో నూతన ఒరవడిని తీసుకువస్తుంది. దుక్కు దున్నే దశ నుంచి వరి కోతలు కోసే వరకూ అన్ని దశలకు సంబంధించిన విభాగాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు రైతులకు అవగతమవుతుంది. పొలంబడిని అనుసరించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఆధునిక పరిజ్ఞానం తెలుస్తోంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంతో వరి సాగులో రైతులకు స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. ఎరువులు, పురుగు మందుల వినియోగం, నీటి యాజమాన్య పద్ధతులను అలవర్చుకుంటున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు.

–ఎస్.లక్ష్మిలావణ్య, ఏఓ, ఆలమూరు

క్లుప్తంగా

భేతాళస్వామి ఉత్సవాలకు శ్రీకారం



అంబాజీపేటలో భేతాళస్వామి ఆలయం వద్ద పందిరిరాట వేస్తున్న భక్తులు

అంబాజీపేట: విజయ దశమి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట శ్రీనివాసనగర్‌లో విజయ భేతాళస్వామి ఆలయం వద్ద స్వామి ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పందిరిరాట వేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 15న భేతాళస్వామివారి కలశస్థాపన చేసేందుకు సంఘ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. 29న భేతాళ వాహన మహోత్సవం, తీర్థం నిర్వహిస్తామని సంఘ అధ్యక్షుడు దొమ్మేటి వెంకట రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జున మోహనరావు, కార్యదర్శి మట్టపర్తి రాము, ఉపాధ్యక్షుడు దొమ్మేటి శ్యామ్, గౌరవాధ్యక్షుడు బొంతు పెద బాబు, ట్రెజరర్ గుత్తుల పండు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



డాక్టర్ ప్రతాప్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, తదితరులు

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సాహితీ సేవలు ప్రశంసనీయమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఆయన్ని ఎమ్మెల్యే గజమాలతో సత్కరించారు. ఈ వివరాలను సోమవారం ప్రతాప్ స్థానిక విలేకరులకు తెలిపారు. ఇటీవల ఏపీ ప్రభుత్వంచే పద్మభూషణ్ బోయి భీమన్న సాఫల్య పురస్కారం అందుకున్న ప్రతాప్‌ను అక్కడ ఎమ్మెల్యే సత్కరించారు.

అలుపెరగని యోధుడు జక్కంపూడి



అప్పనపల్లిలో రామ్మోహనరావుకు నివాళి అర్పిస్తున్న స్థానికులు

మామిడికుదురు: ప్రజా సమస్యల పరిష్కారానికి మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు అలుపెరగని యోధుడిలా ముందుకు సాగారని సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ శ్లాఘించారు. సోమవారం అప్పనపల్లిలో రామాలయం వద్ద తులా గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రామ్మోహనరావు వర్ధంతి నిర్వహించారు. జక్కంపూడి చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయ పార్టీ నేతగా, ప్రజాప్రతినిధిగా, కార్మిక సంఘాల ప్రతినిధిగా, మంత్రిగా జక్కంపూడి అన్ని వర్గాలకు సేవలందించారని కొనియాడారు. దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, కంకిపాటి వెంకటేశ్వరరావు, మేడేపల్లి చిన్న, తులా బ్రహ్మానందం, కంకిపాటి హిమవంతరావు, తులా ఏసునాయుడు, బొంతు చందు, నుదురుమాటి సత్యమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనానికి మట్టి సేకరణ



ముక్తేశ్వరంలో మట్టి కలశాలతో ఊరేగుతున్న బీజేపీ నాయకులు

సఖినేటిపల్లి: నా భూమి.. నా దేశం పేరుతో సేకరించిన మట్టిని సోమవారం కలశాలలోకి ఉంచి ఢిల్లీలో స్మృతివనానికి పంపేందుకు బీజేపీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. ఆ పార్టీ నాయకులు చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు ఆధ్వర్యంలో ఈ మట్టిని సేకరించారు. అనంతరం పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా పట్టపు సూర్యప్రకాశరావును నియమించారు. నాయకులు అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాస నగేష్, రావూరి బాబ్జీ పాల్గొన్నారు.

అంబాజీపేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అంబాజీపేటలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నా భూమి.. నా దేశం ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు మట్టిని కలశాలలో సేకరించారు. అనంతరం ర్యాలీలో ఎస్ఎస్ఎం విద్యాసంస్థల విద్యార్థులు, బీజేపీ నాయకులు కొల్లు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: నా భూమి– నా దేశం కార్యక్రమంలో భాగంగా మండల బీజేపీ అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సేకరించిన మట్టిని ముక్తేశ్వరానికి చేర్చి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ముక్తికాంతక్షణముక్తేశ్వర స్వామి ఆలయం వద్ద పూజాధికాలు నిర్వహించి అన్ని కలశాల మట్టిని ఓ పెద్ద కలశంలో భద్రపరిచారు. పార్టీ నాయకులు అడబాల సత్యనారాయణ, గనిశెట్టి వెంకటేశ్వరరావు, చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, కస్తూరి, యనమదల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శౌర్య జాగరణ యాత్రకు ఘన స్వాగతం



రాజోలులో శౌర్య జాగరణ యాత్రకు స్వాగతం పలుకుతున్న సభ్యులు

రాజోలు: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్న శౌర్య జాగరణ యాత్రకు సోమవారం రాజోలులో ఘన స్వాగతం లభించింది. అయోధ్యలో రామాలయం నిర్మాణం పూర్తి కావొస్తున్న సందర్భంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు కోనసీమ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు. బైక్ ర్యాలీ, మహిళల కోలాటంతో భజన చేస్తూ హనుమాన్ రథాన్ని ఊరేగించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కొత్త పద్మావతి, నూలు శ్యామల, నీరజ, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రాజా నాగరత్నకుమార్ పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు



పి.గన్నవరం సీహెచ్‌సీలో పౌష్టికాహారం అందిస్తున్న సభ్యులు

పి.గన్నవరం: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో బుధవారం 61 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, వైద్యులు అప్పారి సూర్యనారాయణ, యు.రాఘవేంద్రరావు, శిరీష, సురేంద్ర, ఎస్ఎన్ఓ జీఎల్ అనంతకుమారి తదితరులు వైద్య సేవలు అందించారు. గర్భిణులకు, వారి సహాయకులకు వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ నాయకులు నల్లా పెదకాపు, కోరుకొండ జాన్, రామకృష్ణ, కొర్లపాటి రాజేష్, తోరం వంశీ, రావూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి ఉత్సవ కమిటీ సేవలు అభినందనీయం

అమలాపురం టౌన్: ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో అమలాపురం శ్రీదేవి ఉత్సవ కమిటీ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక కలెక్టరేట్‌కు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సోమవారం వెళ్లి కలెక్టర్‌కు దసరా ఉత్సవాల జంబో ఆహ్వాన పత్రాన్ని అందించి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. కలెక్టర్‌ను కలిసినవారిలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గంగాబత్తుల వీర వెంకట సత్యనారాయణ(జీవీ), మామిడిపల్లి రాము, వెలిగట్ల జగదీష్, గంగాబత్తుల వెంకన్నలున్నారు.

చంద్రకుమార్‌కు క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు

అమలాపురం రూరల్: క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా నిర్వహించిన వందే వేద భారతం చిత్రకళా పోటీల్లో పాలగుమ్మి చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు అందుకున్నారు. చిత్రకారుడు ఎం.రాంబాబు, మాడా రాము, స్కూల్ చైర్మన్ మను విహార్, సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి పవన్ కుమార్‌ల చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



అంబాజీపేటలో పథకాలు సాధించిన క్రీడాకారులు

అంబాజీపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో అంబాజీపేట క్రీడాకారులు 12 బంగారు, 7 వెండి, 6 కాంస్య పతకాలను సాధించినట్లు అంబాజీపేట తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో క్రీడాకారులను సోమవారం పలువురు అభినందించారు. 8న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 29వ ఇంటర్ క్లబ్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. సబ్ జూనియర్ కేటగిరీలో డి.జెస్సీలేకణ, కె.ఆస్య, కె.లాస్యాఆద్విక, జి.లాహితితేజ, ఎం.మౌనికలు బంగారు, డి.గిరిజ, ఎస్.కావ్య, సీహెచ్ఎస్ చిన్న వెండి, వి.దినేష్, ఇ.బంగారయ్య, బి.హేమహితిక్ కాంస్య పతకాలు సాధించారన్నారు. కెడిట్ విభాగంలో కాంస్య, జూనియర్ విభాగంలో వెండి, సీనియర్ విభాగంలో బంగారు పతకాలు పొందారన్నారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే నెల కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారన్నారు. విజేతలను హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, తైక్వాండో కోచ్‌లు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై హరికోటి శాస్త్రి

పి.గన్నవరం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. నరేంద్రపురం గురుకుల పాఠశాలలో మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ పి.వేణు అధ్యక్షతన సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంతో ఉండాలని, ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావంతో మెలగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. మమత స్వచ్ఛంద సేవా సమితి గౌరవాధ్యక్షుడు నల్లా పెదకాపు, కోరుకొండా రాజు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంతో ఉపయోగాలు



కడలిలో డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసే విధానం వివరిస్తున్న శాస్త్రవేత్తలు

రాజోలు: డ్రోన్ ద్వారా పంట పొలాల్లో మందులు పిచికారీ చేయడం ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త భరతలక్ష్మి అవగాహన కల్పించారు. సోమవారం కడలి గ్రామంలో వరి పంటపై తెగుళ్లు, పురుగుల నివారణకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేసే విధానం వివరించారు. కేవలం పది నిమిషాల్లో ఒక ఎకరం పొలంలో పురుగు మందును పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్ వినియోగించడం ద్వారా సమయం, వ్యయం ఆదా చేసుకోవచ్చని అన్నారు. వ్యవసాయ అధికారుల బృందం జ్యోతిర్మయి, రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం



లూటుకుర్రులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



పెనికేరులో వైద్య సేవలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొత్తపేటలో శిబిరం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి, డీఎంహెచ్ఓ దొర



రావిగుంటచెరువు గ్రామంలో సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

- జగనన్నతోనే అది సాధ్యం
- గ్రామాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు

మామిడికుదురు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు అన్నారు. సోమవారం లూటుకుర్రులో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తాతకాపు మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా నిత్యం వేలాది మంది వైద్య సేవలు పొందుతున్నారన్నారు. ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, కుసుమ శ్రీధర్, డాక్టర్ స్పందన, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్ పాల్గొన్నారు.

ఆలమూరు: పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని సర్పంచ్ వనుం చిన్నావతి జార్జిబాబు, ఎంపీటీసీ యనమదల స్వాతి, సొసైటీ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జుత్తుక శ్రీనివాస్ అన్నారు. పెనికేరులో ఎంపీడీఓ కె.జాన్ లింకన్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.జానకి రాఘవ, ఏపీఎం ఎం.ధనరాజు, కార్యదర్శి జాజుల అయ్యన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్య నిపుణులు ఇ.మౌళి, పి.వసంతలక్ష్మితో పాటు స్థానిక వైద్యులు ఆర్.మల్లికార్జున, పి.భవానీశంకర్, డి.సువర్చల దేవి, పి.శ్రీలక్ష్మి పాల్గొని 412 మందికి వైద్య సేవలు అందించారు. నలుగురిని మెరుగైన వైద్యానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన 42 రకాల పౌష్టికాహార వంటకాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పి.శారద పరిశీలించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా పాల్గొన్నారు.



రావులపాలెంలో పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు

నేడు కొత్తపేటలో..

కొత్తపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తపేటలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు కానుంది. దీనిని ఇక్కడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. టీమ్–2 అధికారి, తహసీల్దార్ జీడీ కిశోర్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఈ శిబిరాన్ని కలెక్టర్‌తో పాటు ఆరోగ్య సురక్ష ప్రత్యేక అధికారి సందర్శించనున్నారు. ఆ మేరకు శిబిరం ఏర్పాట్లను ఆర్డీఓ ఎం.ముక్కంటి, డీఎంహెచ్ఓ ఎం.దుర్గారావుదొర పరిశీలించారు.

రావులపాలెం: రావులపాలెం-5 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార స్టాల్‌ను సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి పరిశీలించారు. 568 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు కోట విజయకుమారి, గూటం తిమోతి ప్రకాశరావు, జక్కంపూడి సత్యవతి, నాయకులు సఖినేటి వాకులరాజు, ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, వైద్యులు హసీనా, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అయినవిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించిందని ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవి అన్నారు. విలస శివారు రావిగుంటచెరువు గ్రామంలో సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. సుమారు 450 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరికి ప్రభుత్వం అందించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార శిబిరం ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బడుగువానిలంకలో గడప గడపకూ..

ఆలమూరు: బడుగువానిలంకలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

అంబాజీపేట: గర్భిణులు మూడో నెల నుంచి తొమ్మిదో నెల వరకూ ఆరోగ్య నియమాలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన కార్యక్రమం సీహెచ్ఓ బి.అప్పారావు అధ్యక్షతన సోమవారం జరిగింది. గర్భిణులను పరీక్షించి ఐరన్ మాత్రలు, సిరప్‌లు అందజేశారు. హెచ్‌వీ రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర పూజలు



స్వామివారి అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామివారి అష్టోత్తర పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలను ఆలయ ఆలయ అర్చకులు చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నవోదయకు ఎంపిక



సాన్విత

ఆత్రేయపురం: స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మైలాబత్తుల సాన్విత పెద్దాపురం నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైంది. ఆమె తండ్రి మైలాబత్తుల సురేష్‌బాబు ఆత్రేయపురం మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తన ఇద్దరు కుమార్తెలను ప్రభుత్వ పాఠశాల్లోనే చదివిస్తూ సురేష్‌బాబు ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిగా నిలిచారని విద్యాశాఖ అధికారులు, మండల యూటీఎఫ్ శాఖ సభ్యులు అభినందించారు.

ప్రార్థనా మందిరాల పరిరక్షణపై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గోవిందరాజు

రాజోలు: ప్రార్థనా మందిరాల పరిరక్షణపై రాజోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద సీఐ గోవిందరాజు, ఎస్సై పృథ్వీ సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 150 హిందూ దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఉన్నాయన్నారు. ప్రార్థనా మందిరాల వద్ద కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ కమిటీలు బాధ్యత తీసుకుని వాటి భద్రతపై దృష్టి సారించాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కొత్తపేట: న్యాయవాదుల సంక్షేమ నిధి పేరిట అన్ని దరఖాస్తులపై రూ.20 స్టాంపులు అంటించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏకపక్ష నిర్ణయం తీసుకుందంటూ కొత్తపేటలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ప్రభుత్వ న్యాయవాది జి.విజయ, అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యవాడ సందీప్‌కుమార్, సభ్యులు ర్యాలి శ్రీనివాస్, దాసి బాలప్రతాప్, రాజారావు, నారాయణమూర్తి, పద్మాజీరావు, వేణుగోపాలరెడ్డి, అల్లు భాస్కరరావు, పళ్లంరాజు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

రావులపాలెం: ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ జన్మదిన వేడుకలను సోమవారం ఈతకోట గ్రామంలో ఆయన అభిమానులు నిర్వహించుకున్నారు. వినాయక్ సేవా యూత్ సభ్యులు గంధ్రోతు వీరగోవిందరావు, దుర్గాసురేష్, దుర్గాదేవి ఆధ్వర్యంలో రామాలయం వద్ద కేక్ కట్ చేశారు. సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బుజ్జి చేతుల మీదుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులు, పేదలకు దుప్పట్లు, రొట్టెలు పంపిణీ చేశారు.